క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ సత్యనారాయణపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి. సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భగత్‌సింగ్‌రోడ్డు, దండమూరి రామ్మోహన్ వీధి, వందనపువారి వీధి, శివాలయం రోడ్డు, శివరావు స్ట్రీట్, బ్రహ్మయ్య పంతులు వీధి, నర్రావారి స్ట్రీట్, గిరి స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

మధురానగర్ సెక్షన్ పరిధిలో ..

మధురానగర్ సెక్షన్ సాయిబాబా కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయిబాబా కాలనీ, నేతాజీ కాలనీ, పప్పులమిల్లు, పసుపుతోట, దేవీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ప్రభుత్వ సేవలను వినియోగించుకోండి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ పథకాలు, సేవలను వినియోగించుకోవాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ఎస్వీ జానారెడ్డి సూచించారు. 30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీలో సోమవారం ఆయన రెసిడెన్షియల్ వెల్ఫేర్ సంఘ నేతలతో కలిసి పర్యటించారు. స్థానిక సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరి సమస్యలు సత్వరమే పరిష్కరించడానికి డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్, వార్డు సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకుని ప్రభుత్వ పథకాలు పొందవచ్చని చెప్పారు. సమస్యల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడానికి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు తమవంతు పాత్రను పోషించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అర్జా వెంకటేశ్వరరావు, మధు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

త్వరగా పనులు పూర్తి చేయండి

పాయకాపురం(విజయవాడరూరల్): డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని 61వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం కార్పొరేటర్ పార్టీ నాయకులతో కలిసి జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వీఎంసీ నిధులు రూ.15 లక్షలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. కార్యాలయంలో రెండు గదులుంటాయన్నారు.

వైఎస్సార్ బీమాతో ధీమా

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ బీమాతో ప్రతి నిరుపేద కుటుంబానికి ధీమా కల్పించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని 31వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పెనుమత్స సత్యం అన్నారు. 31వ డివిజన్‌కు చెందిన పారి చిన్నారావు ఇటీవల మృతి చెందారు. దీంతో సోమవారం వార్డు సచివాలయం సెక్రటరీ నాగరాజుతో కలిసి ఆయన చిన్నారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మట్టి ఖర్చుల కింద వైఎస్సార్ బీమా నగదు రూ.10 వేలను చిన్నారావు భార్యకు అందజేశారు. నేతలు అంగిరేకుల విజయ్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల ఆరాధ్య దైవం మండల్

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీసీల ఆరాధ్యదైవం బీపీ మండల్ అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం బీపీ మండల్ డే నిర్వహించారు. తొలుత మండల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బోను దుర్గా నరేష్ మాట్లాడుతూ బీపీ మండల్ పోరాటంతోనే బీసీలకు రిజర్వేషన్ ఫలాలు అందాయన్నారు. బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చిన ఆగస్టు 7ను బీపీ మండల్ డే గా జరుపుకుంటున్నామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బీసీ హక్కుల కోసం మండల్ బాటలో పయనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం చంద్రశేఖర్ నాని, సంఘం నాయకులు మెండు జ్యోతి, కిరణ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో అక్కినేని శతజయంతి ఉత్సవాలు

విజయవాడ కల్చరల్: సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా సెప్టెంబరులో ఘనంగా నిర్వహిస్తామని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి సంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదిక మీద సోమవారం జిల్లా స్థాయి నాగేశ్వరరావు అభిమానుల ఆత్మీయ సమావేశం, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు.

టీకాలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత



చిన్నారులకు వ్యాక్సిన్లు వేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, పక్కన డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్ షాహీనాసుల్తానా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం టీకాలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా ఇందిరానాయక్‌నగర్, సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటర్లలోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం ఏర్పాటుచేసిన వ్యాక్సినేషన్ క్యాంపులను వారు సందర్శించారు. గర్భిణులు, చిన్నారులకు వందశాతం వ్యాక్సినేషన్‌ను అందించాలనే దృఢ సంకల్పంతో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, డీఎంహెచ్‌ఓ సుహాసిని, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ ఇందుమతి, డీఐఓ అమృత, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి అన్నారు. స్థానిక మధురానగర్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో సోమవారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం జరిగింది. ఆరోగ్య సిబ్బందితో కలిసి వ్యాధినిరోధక టీకాల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజ స్థాపనకు చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు తప్పకుండా వేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అంజు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు వ్యాక్సిన్లు వేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా



చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి

దుర్గాపురంలో..

దుర్గాపురం 198వ వార్డు సచివాలయంలో జరిగిన వ్యాధినిరోధక టీకాల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ హరిచందన వ్యాధినిరోధక టీకాలు వేయించాల్సిన ఆవశ్యకతను తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ కొండాయగుంట రాము, సుకన్య, లక్ష్మి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): 61, 62, 64వ డివిజన్లలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వద్ద చిన్న పిల్లలకు టీకాలు వేశారు. కార్పొరేటర్లు అలంపూరు విజయలక్ష్మి, యరగొర్ల తిరుపతమ్మ డ్రాప్స్ వేశారు.

పొంగు, తట్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ ఏడాది చివరి నాటికి జిల్లాలను పొంగు, తట్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా మూడు విడతల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సోమవారం భవానిపురంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ 5.0 లో భాగంగా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ సుహాసిని, డీఐఓ డాక్టర్ అమృత తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తికర పరిష్కారాలను అందించాలి

మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్



స్పందనలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్పందనలో అందుకున్న విజ్ఞప్తులకు సంతృప్తికర పరిష్కారాలు అందించాలని, సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం జరిగిన స్పందనలో వీరు పాల్గొన్నారు. మొత్తం 21 ఫిర్యాదులు రాగా అందులో పట్టణ ప్రణాళిక విభాగం–10, ఇంజినీరింగ్ విభాగం–3, రెవెన్యూ–4, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)–1, ఉద్యానవన విభాగం–1, పబ్లిక్ హెల్త్ విభాగం–2 ఉన్నాయి. స్పందన, అవర్ వీఎంసీ పోర్టల్‌ను వీఎంసీ అన్ని విభాగాల ఉన్నతాధికారులు రోజూ సమీక్షించాలన్నారు.

ఫిర్యాదులు పెండింగులో లేకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్(జనరల్), యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ఎ.డి.హెచ్ శ్రీనివాసు, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, వీఏఎస్ డాక్టర్ రవిచంద్, మేనేజర్ బి.శ్రీనివాస్‌రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వీఎంసీ భవనం నిర్మాణ పనులు పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం సాయంత్రం అధికారులతో కలసి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణలో నిర్మాణ దశలో ఉన్న నూతన భవనాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ప్రభాకరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

గద్దర్‌కు కొమ్మినేని నివాళి



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): అనేక ప్రజా ఉద్యమాలను తీర్చిదిద్దిన గద్దర్ లేని లోటు పూడ్చలేనిదని సీ రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గద్దర్ పార్థివదేహం వద్ద కొమ్మినేని శ్రీనివాసరావు సోమవారం నివాళులు అర్పించారు. గద్దర్ కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. తన ఆట పాటలతో గద్దర్ ప్రజల్లో చైతన్య స్ఫూర్తిని నింపారని కొమ్మినేని కొనియాడారు.

ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, పక్కన డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 60వ డివిజన్‌లోని 267వ వార్డ్ సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన 191 గడపలను సందర్శించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయంలో వాంబే కాలనీ దుస్థితి ఎలా ఉంది, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ పాలనలో ఎన్ని మెరుగైన పనులు చేపట్టామో అనేది ప్రజలందరూ గమనిస్తున్నారని వివరించారు. ఈ ఒక్క సచివాలయం పరిధిలో రూ.5.13 కోట్ల సంక్షేమాన్ని అందించామని, 156 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని తెలిపారు.

చంద్రబాబు బేషరతుగా క్షమాపణ చెప్పాలి

రాజకీయ లబ్ధికోసం ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని ఎమ్మెల్యే విష్ణు ఆరోపించారు. రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి చంద్రబాబు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ సీడీఓ జగదీశ్వరి, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన బీఓఐ ఉద్యోగులకు అభినందన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బ్యాంక్ ఆఫ్ ఇండియా 118వ ఫౌండేషన్ డే సందర్భంగా సందీప్ బాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన పోటీల్లో విజేతలైన ఉద్యోగుల అభినందన కార్యక్రమం బ్యాంక్ బ్రాంచ్‌లో సోమవారం నిర్వహించారు. వివిధ స్థాయిల్లోని బ్యాంకు అధికారులు బాడ్మింటన్ ఆటలో విజేతలైన ఉద్యోగుల్ని అభినందించారు. ట్రోఫీలు సాధించిన ఉద్యోగుల్ని బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ బంగార్రాజు, డిప్యూటీ జోనల్ మేనేజర్ సూర్యకిరణ్, ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నగేష్, స్టాఫ్ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి రత్నాకర్ శాలువాలు కప్పి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

టీడీపీ.. మోసం చేయాలని చూస్తోంది

ఆ పార్టీ నేతలపై డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ ధ్వజం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యలు పట్టించుకోని టీడీపీ నేతలు ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతుండటంతో అబద్ధపు మాటలతో ప్రజలను మోసం చేయాలని చూడటం సిగ్గుచేటని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. 58వ డివిజన్ నందమూరినగర్‌లో ఆదివారం జరిగిన ఘటనపై 60వ డివిజన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నందమూరినగర్ ప్రాంతంలోని నాలుగు దశాబ్దాలుగా జీవిస్తున్న ప్రజలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు టీడీపీ నాయకులకు నాడు తీరిక లేదని విమర్శించారు. వారు ఎన్నికలకు రెండు నెలల ముందు ఇళ్ల పట్టాలు ఇచ్చేస్తాం, జీఓ తెచ్చాసామంటూ అమాయక ప్రజల నుంచి రూ. 500 కట్టించుకున్నారని గుర్తుచేశారు. కనీసం ఆ జీఓ ఏంటో కూడా టీడీపీ నాయకులకు తెలీదని, కేవలం ఎన్నికల్లో ఎలా అయినా లబ్ధి పొందాలనే దుర్బుద్ధితో ప్రజలను మోసం చేశారు తప్ప వాస్తవానికి ఏ జీఓను వారు తీసుకురాలేదని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా నందమూరినగర్‌లో వారికి ఇంటిపట్టాలు ఇచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంటే ఇప్పుడు టీడీపీ నాయకులు మళ్లీ ఆ ఇళ్ల పట్టాల కోసం జీవోను తీసుకువచ్చింది మేమే అంటూ కరపత్రాలను వేసి ప్రజలకు పంచాలని చూడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ దుశ్చర్యను నందమూరినగర్ వాసులు ధైర్యంగా ఎదురించడం సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తిని ప్రజలంతా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

తల్లి పాల విశిష్టత తెలుసుకోవాలి

సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): తల్లి పాలతో బిడ్డకు కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. తల్లిపాల విశిష్టత ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రి పీడియాట్రిక్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ముగింపు వేడుకలు సోమవారం నిర్వహించారు. డాక్టర్ కంచర్ల సుధాకర్ మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలిస్తే తల్లీబిడ్డ ఇద్దరికీ ప్రయోజనం కలుగుతుందన్నారు. బిడ్డకు పుట్టిన అరగంటలోపు పాలివ్వడం ద్వారా శిశువులో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు పాలివ్వడంపై తల్లులకు సరైన అవగాహన లేక పోవడం దురదృష్టకరన్నారు. తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని నర్సింగ్, ఇతర సిబ్బందికి నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. తల్లిపాలపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థులు తల్లిపాల ఆవశ్యకతను తెలియచేస్తూ ప్రదర్శించిన మైమ్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ పి.అనిల్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సునీత, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జమల పూర్ణమ్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 8వ జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ సోమవారం నూలు వడుకుతున్న గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ స్వదేశీ ఉద్యమంలో చేనేత రంగం ముఖ్యమైన పాత్ర పోషించిందన్నారు. అంతటి చరిత్ర కలిగిన చేనేత రంగానికి ప్రత్యేక రోజు ఉండాలనే ఉద్దేశంతో 2015 ఆగస్టు 7న చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రారంభించి, లోగోను ఆవిష్కరించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మి, కె.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రాధాన్యం



ఆర్సీఎం చర్చి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యమిచ్చారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నగరంలోని 23వ డివిజన్ రామమందిరం రోడ్డు, 24 డివిజన్‌లో కస్తూరిభాయిపేట ఆర్సీఎం చర్చి రోడ్డును రూ.35 లక్షల వ్యయ అంచనాతో చేసిన అభివృద్ధి పనులను సోమవారం మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే విష్ణు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం మాటలకే పరిమితమైందని, తాము అభివృద్ధి చేసి చూపుతున్నామన్నారు. అందుకు నగరంలో జరుగుతున్న ప్రారంభోత్సవాలే నిదర్శనంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత, 23వ డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరు సుబ్బారావు, నాయకులు బెల్లపు సత్యనారాయణ, మోహనరావు, ఎం.బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సెల్‌ప్లాంట్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన ఎక్సెల్‌ప్లాంట్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎంట్రన్స్ గేటు సమీపంలోని పార్కింగ్ వద్ద ఫ్లోరింగ్ రాళ్ళను ఏర్పాటు చేయాలని, ప్లాంట్‌కు రోజూ ఎంత చెత్త వస్తుంది అని సిస్టమ్‌లో నమోదవ్వాలని, చెత్త వేయింగ్ (వే బ్రిడ్జి) పని తీరును పర్యవేక్షించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

రాకపోకలకు లైన్‌క్లియర్



పసుపుతోటలో రాకపోకలకు వీలుగా ఏర్పాటు చేసిన రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రద్దీగా ఉండే మధురానగర్ ఆర్‌యూబీ వద్ద రాకపోకలకు లైన్ క్లియరైంది. ఇక్కడ ఆర్‌యూబీ పనుల్లో భాగంగా మెయిన్ రోడ్డు మూసివేసి పసుపుతోట మీదుగా వాహన రాకపోకలకు అనుమతిస్తున్నారు. మధురానగర్ గద్దె వెంకట్రామయ్య ఉద్యానవనం పక్క నుంచి కేవలం సన్నదారి మాత్రమే ఉండటంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌యూబీ పనుల్లో భాగంగా సుమారు రెండు నెలల పాటు మెయిన్‌రోడ్డు కనెక్టివిటీను క్లోజ్ చేయాల్సి ఉండటంతో స్థానికుల విజ్ఞప్తిపై 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష ఆర్‌యూబీ ప్రాంతాన్ని పరిశీలించారు. వారు ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అధికారులతో మాట్లాడి రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉద్యానవనం గోడను కొంతమేర పగలకొట్టి విశాలంగా సర్వీసు రోడ్డు వేయించారు. వాహన చోదకులు రావడం, వెళ్లడం పసుపుతోటలోని చిన్న రోడ్డు మీదగా సాగించాల్సి వస్తుందని గుర్తించారు. పసుపుతోటలోకి ఒక రోడ్డును వచ్చేవారి కోసం మరో రోడ్డును వెళ్లేవారి కోసం కేటాయించాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం కార్పొరేటర్ పెనుమత్స శిరీష అధికారులను కలిసి రాకపోకలకు వీలుగా వన్‌వే చేయించడంతో పాటు పోలీసులను నియమించాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యుత్ ఉద్యోగుల ధర్నా కారణంగా సామాన్య ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నగరంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు, ఆంక్షలు అమలులో ఉంటాయని పోలీస్ కమిషనర్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

- చుట్టుగుంట నుంచి రామవరప్పాడు వైపునకు పడవల రేవు మీదుగా ఎటువంటి వాహనాలు అనుమతించరు.
- మధురానగర్ జంక్షన్ నుంచి రామవరప్పాడు వైపునకు పడవల రేవు మీదుగా వాహనాలు అనుమతించరు.
- రామవరప్పాడు నుంచి పడవల రేవు (ఏలూరు రోడ్) వైపు ఎలాంటి వాహనాలు అనుమతించరు.
- గుణదల పోస్టాఫీస్ జంక్షన్ నుంచి ఈఎస్‌ఐ హాస్పటల్ కటింగ్ (ఏలూరు రోడ్) వైపు ఎలాంటి వాహనాలు అనుమతించరు.
- చుట్టుగుంట నుంచి రామవరప్పాడు వెళ్లాల్సిన వాహనదారులు చుట్టుగుంట జంక్షన్ నుంచి నైస్ బార్ జంక్షన్ – మధు చౌక్ – జమ్మిచెట్టు సెంటర్ – సిద్ధార్థ జంక్షన్ – అమ్మ కల్యాణ మండపం జంక్షన్ వద్ద కుడి వైపునకు రమేష్ హాస్పటల్ జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- ఈఎస్‌ఐ హాస్పటల్ కటింగ్ (ఏలూరు రోడ్) నుంచి రామవరప్పాడుకు విద్యుత్ సౌధ మీదుగా వెళ్లడానికి అనుమతి లేదు.

మణిపాల్‌లో అవయవదానం

నలుగురి జీవితాల్లో కొత్త వెలుగులు



టి. వీరభద్రరావు (ఫైల్)

తాడేపల్లిరూరల్: అనారోగ్యంతో మణిపాల్ హాస్పిటల్‌లో చేరిన ఒక వ్యక్తికి బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో అతని అవయవాలతో మణిపాల్ హాస్పిటల్ వైద్యులు ఆ వ్యక్తి కుటుంబ సభ్యుల అనుమతితో మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపారు. సోమవారం మణిపాల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కంటిపూడి సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా, గోదావరి వీధి, అరండల్‌పేట, వీటీసీకి చెందిన టి. వీరభద్రరావు (68) అనారోగ్యంతో స్థానికంగా ఉన్న హాస్పిటల్‌లో చేర్పించారు. మెరుగైన వైద్య నిమిత్తం తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌కు తీసుకు వచ్చారు. అప్పటికే అతను స్పృహ కోల్పోయి ఉండడంతో వైద్య పరీక్షల అనంతరం అతని బ్రెయిన్ డెడ్ అయినట్లు పరిగణించారు. అతని భార్య టి. అనూరాధ, కుమార్తె, కుమారుడు అంగీకారం మేరకు ఏపీ జీవన్‌దాన్ చైర్మన్ డాక్టర్ కె. రాంబాబు ఆధ్వర్యంలో అవయవదానం జరిగిందని, కాలేయం, ఒక కిడ్నీని మణిపాల్ హాస్పిటల్‌లో అవసరమయిన వారికి ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించామని, కార్నియా ఎల్.వి. ప్రసాద్ ఐ హాస్పిటల్ విజయవాడ, మరొక కిడ్నీ వేదాంత్ హాస్పిటల్, గుంటూరు తరలించామని తెలిపారు. అవయవదానానికి అంగీకరించి మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపిన వీరభద్రరావు కుటుంబానికి మణిపాల్ హాస్పిటల్స్ ధన్యవాదాలు తెలిపింది

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

రూ.2.50 లక్షలు తీసుకున్న వ్యక్తిపై కేసు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి యువకుడిని మోసం చేసిన వ్యక్తిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అన్నమయ్యజిల్లా రైల్వే కోడూరు మండలానికి చెందిన కస్తూరి శ్రీనివాసులు బీటెక్ చేశాడు. బీటెక్‌లో ఆగిపోయిన సబ్జెక్టులను 2019లో అనంతపురంలోని జేఎన్‌టీయూ కాలేజీలో రాసేందుకు వెళ్లగా అక్కడ సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన రవి నాయక్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తాను బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని, రూ.2.50 లక్షలు ఇస్తే వెంటనే జాబ్ వచ్చేస్తుందని నమ్మించాడు. అతని మాటలను నమ్మిన శ్రీనివాసులు 2020 మార్చి నెలలో సింగ్‌నగర్‌కు వచ్చి రవినాయక్‌కు రూ.2 లక్షల నగదు, రూ.50 వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఆ తరువాత తన జాబ్‌విషయమై శ్రీనివాసులు రవినాయక్‌కు ఫోను చేయగా కరోనా అని, వచ్చే నెలలో వస్తుందంటూ కాలయాపన చేస్తూ వస్తున్నాడు. సంవత్సరాలు గడుస్తున్నా తనకు జాబ్ రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన శ్రీనివాసులు సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.